

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు(సూరిబాబు) హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి దారబోయిన లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూరిబాబు ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పంచాయితీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, దోమల మందు పిచికారి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగరాజు కుమారి, చింతలపూడి మలేరియా వైద్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ రూటే వేరు..!

ఇళ్లకు కరెంటు ఆపేసి చేపల చెరువులకు సరఫరా

చెరువులున్న గ్రామాల్లో ఐదారు గంటలు కరెంటు కోత

నిడమర్రు మండలంలో పరిస్థితి మరింత దారుణం

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో నిర్లక్ష్యంతో లోఓల్టేజీతో జనం సతమతం

నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల కనెక్షన్లపై ఫిర్యాదులొచ్చినా పట్టదు

కొత్త విద్యుత్ సర్వీస్ కావాలంటే రూ.6,500 వసూలు



నిడమర్రు శివార్లలో కరెంటు స్తంభానికి ఏర్పాటు చేసిన ఈ రాడ్ చేపల చెరువులకోసమే అంటున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ శాఖాధికారుల వ్యవహారశైలి వివాదస్పదంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. విచ్చలవిడి కరెంటు కోతలపై జనం అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని చెబుతున్నారు. చేపల చెరువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లోని ఇళ్లకు కరెంటు నిలిపేసి మరీ చేపల చెరువులకు కరెంటు సరఫరా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో కరెంటు కోతలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని డెల్టా మండలాల్లో పెద్దఎత్తున చేపల చెరువులు ఉన్నాయి. ఆయా మండలాల్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండటంపై జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. చేపల చెరువు యాజమాన్యాల నుంచి పెద్దఎత్తున మామూళ్లు అందుతున్న కారణంగా ఇళ్లకు కరెంటు కోతలు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకపక్క ప్రభుత్వం 24 గంటలు కరెంటు సరఫరా చేస్తున్నట్లు గొప్పలు చెబుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిస్థితి జిల్లాస్థాయిలో ఉంది. ముఖ్యంగా నిడమర్రు మండలంలోని విద్యుత్ శాఖ అధికారుల తీరు చర్చనీయాంశమవుతోంది. జిల్లాకు ప్రస్తుతం సరిపడా విద్యుత్ సరఫరా అవుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ గ్రామాల్లో మాత్రం తీవ్రంగా కరెంటు కోతలు విధిస్తున్నారు. నిడమర్రు మండలం అడవికొలను పంచాయతీలోని సత్యనారాయణపురంలోని కాలనీల్లో కరెంటు కోతలు నాలుగైదు గంటలకుపైగా సైతం విధిస్తున్నట్లు అక్కడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అనేకసార్లు జనం అధికారులకు ఫిర్యాదు చేశారు. చేపల చెరువులకు కరెంటు సరఫరా చేయడం కోసం ఇళ్లకు కోతలు పెడుతున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యత తీవ్రంగా ఉందని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా చేయకపోవడంపై జనం గగ్గోలు పెడుతున్నారు. ఈదురు గాలులు వీస్తే కరెంటు ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గంటలు తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇన్వర్టర్లు ఉన్న కుటుంబాలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులుగాని, అధికారులుగాని ఈ సమస్యలను పట్టించుకోకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేపల చెరువులకు కరెంట్ సరఫరా చేస్తూ ఇళ్లకు కోతలు పెడుతున్న వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

చేపల చెరువులపై నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు

చేపల చెరువులకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కనెక్షన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. జనం నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నిడమర్రు మండలంలోని విద్యుత్ శాఖాధికారుల వ్యవహార శైలి మరింత చర్చనీయాంశంగా ఉంది. ప్రభుత్వం పదెకరాలలోపు చేపల చెరువులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తోంది. కొంతమంది బడాబాబులు 50 ఎకరాలు, ఆపై ఉన్న చెరువులపై ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లను పదెకరాలలోపుగా చూపించి విద్యుత్ రాయితీ పొందుతున్నారు. అంతేకాకుండా చెరువులో భూమిలేని వ్యక్తుల పేరిట అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు వస్తున్నప్పటికీ తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇస్తూ మూసివేస్తున్న పరిస్థితి ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొత్త కనెక్షన్‌కు రూ. 6,500 వసూలు

ఇంటికి కొత్త విద్యుత్ సర్వీసు ఏర్పాటు చేసుకునేవారి నుంచి పెద్దఎత్తున మామూళ్లు వసూలు చేస్తున్న పరిస్థితి విద్యుత్‌శాఖలో ఉంది. నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ సర్వీస్‌కు రూ.3,950 చెల్లించాలి. విద్యుత్ శాఖాధికారులు మాత్రం రూ.6,500 వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే సరైన సమాధానం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని జనం కోరుతున్నారు.

పిజిఆర్‌ఎస్‌లో 337 అర్జీల స్వీకరణ

పరిష్కారంలో అర్జీదారుని సంతృప్తే ధ్యేయం - కలెక్టర్ కె.వెట్రిసెల్వి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను కలెక్టర్ ఆమె స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 337 అర్జీలు అందాయని తెలిపారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కారం ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన కె.బ్రహ్మారెడ్డి అర్జీనిస్తూ తన పేరున ఉన్న 70 ఎకరాల భూమి ఇద్దరు కుమారులు తీసుకున్నారని, ఐనప్పటికీ వృద్ధాప్యంలో ఉన్న తనను చూడటం లేదని, ఈ విషయంలో వృద్ధుల సంక్షేమ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి హామీ కూలీలను బెదిరించి, ఇబ్బంది పెట్టిన బిజెపి నాయకులు, జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి జిల్లా కలెక్టర్‌కు సోమవారం టపాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొయ్యలగూడెం రోటరీ క్లబ్‌లో బిజెపి నిర్వహించిన సమావేశం సందర్భంగా ముందురోజు రాత్రి రేపు ఉదయం ఉపాధి హామీ పని లేదని, మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఉందని, బిజెపి జిల్లా నాయకులు తపన చౌదరి వస్తున్నారని, ఈ సమావేశానికి వచ్చిన కూలీలకే మస్తర్ వేస్తామని, రానివారికి వేయబోమని బెదిరించి ఉపాధి హామీ కూలీలు సుమారు 200 మందిని బిజెపి సమావేశానికి తీసుకెళ్లడం దారుణమని ఖండించారు. ఆ సమావేశంలో కూలీలకు ఇష్టం లేకపోయినా ప్రతి కూలీకి బిజెపి కండువాలు బలవంతంగా వేసిన బిజెపి నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ యోగా డే కార్యక్రమానికి కూడా ముందు రోజు రాత్రి ఫోన్ చేసి ఉపాధి హామీ కూలీలకు రేపు పని లేదని, అందరూ ఉదయం 7 గంటలకే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని, అందుకు కొయ్యలగూడెం హైస్కూల్ గ్రౌండ్‌కు రావాలని, వచ్చిన ఉపాధి హామీ కూలీలకు మాత్రమే మస్తర్లు వేస్తామని, రానివారికి వేయబోమని బెదిరింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, స్వచ్ఛందంగా చేయాల్సిన వ్యాయామాలను ఈ రకంగా నిర్బంధ పద్ధతిలో చేయించడం తగదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని, పూర్తిస్థాయిలో పనులు చూపాలని, కూలీలకు బకాయిలు లేకుండా వేతనాలు సకాలంలో చెల్లించాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏలూరులో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో శిక్షణ పొందుతున్న బాలికలు లైంగిక వేధింపులకు గురవ్వడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, ఎటువంటి ప్రలోభాలకు, రాజకీయ ఒత్తిడికి లొంగకుండా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

సొంత మండలానికే బదిలీ అవకాశం కల్పించాలి

సచివాలయ ఉద్యోగుల వినతి



ఎంపిడిఒ రామకృష్ణకి వినతిని అందజేస్తున్న ఉద్యోగులు

ముదినేపల్లి : సచివాలయ ఉద్యోగి సొంత మండలానికే అధికారులు బదిలీలు కల్పించాలని కోరుతూ సోమవారం మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ ఉద్యోగులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగస్తులు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రారంభమై ఐదేళ్లు పూర్తవుతున్న తరుణంలో మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సొంత మండలాలకే బదిలీలు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో పనిచేయాలన్న ఆసక్తి ఉందన్నారు ప్రస్తుతం సచివాలయ ఉద్యోగి జీతం రూ.30 వేలు లోపు ఉండడంతో ఈ కుటుంబంతో పాటుగా వేరే మండలంలో జీవనం సాగించడం అంటే ఆర్థికంగా కష్టతరమవుతుందన్నారు. ఉద్యోగి సొంత మండలంలో పనిచేస్తే నివాస ఖర్చులు తగ్గుతాయన్నారు. బదిలీల ప్రక్రియ అంత ఆన్‌లైన్‌లో పారదర్శకగా నిర్వహించాలని కోరుతూ ఎంపిడిఒ వై.రామకృష్ణ, తహశీల్దార్ షేక్ లతీఫ్ భాషా, ఎస్ఐ వీరభద్రుడు మండల స్థాయి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

'పిఎం సూర్యఘర్ యోజన'ను వినియోగించుకోవాలి

విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సాల్మన్ రాజు

ఏలూరు సిటీ : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ సాల్మన్ రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏలూరులోని ఆర్ఆర్ పేటలో గల విద్యుత్ భవనంలో సోమవారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకం గృహ విద్యుత్ వినియోగదారులకు ఒక గొప్ప సువర్ణ అవకాశం అని, ప్రతి గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటిపై సోలార్ ప్యానల్స్‌ను సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవాలని, అన్ని జాతీయ బ్యాంకులు తక్కువ వడ్డీకే సులభ వాయిదాలలో చెల్లించేలా లోను సౌకర్యం కల్పించుచున్నారని తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులను ప్రోత్సహించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ పానెల్స్ ఏర్పాటుకు మెదటి, రెండవ కిలోవాట్‌కి సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఇఇ ఎ.రాధాకృష్ణ, డిఇ, నోడల్ అధికారి ఎ.రమాదేవి పాల్గొన్నారు.

సమస్యల జోరు.. ఆందోళనలు హోరు

జిల్లాలో వివిధ తరగతుల ప్రజానీకం పలు సమస్యలతో సతమతమవుతున్నారు. సుమారు నెల రోజులుగా అధికారులు యోగాసనాల్లో నిమగ్నం కావడంతో జనం విసిగి వేసారిపోయారు. యోగా ఈవెంట్ ముగిసి అధికారులు అందుబాటులోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం రోడ్డెక్కి ఆందోళన బాట పట్టారు. సోమవారం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, ఆయిల్‌ఫెడ్ కార్మికులతోపాటు యువత పోరు పేరిట వైసిపి కూడా ధర్నాలు చేపట్టడంతో కలెక్టరేట్ ప్రాంతం నినాదాల హోరుతో దద్దరిల్లింది.

సంక్షేమ పథకాల అమలు కోరుతూ అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు..



నినదిస్తున్న అంగన్వాడీలు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి అంగన్వాడీలు ధర్నాకు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా వాటి ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులందరికీ అమ్మకు వందనం వేస్తున్నానని ప్రకటించిన ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ సెంటర్లు నిర్వహిస్తున్నారని, వారిని వెంటనే మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఎఫ్‌ఆర్ఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీలకు నాణ్యమైన ట్యాబ్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు టి.మాణిక్యం, ఎంఎఎన్.తులసి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. గత ప్రభుత్వం 42 రోజులు సమ్మె చేసినా అంగన్వాడీల సమస్యలు పట్టించుకోలేదని, ఫలితంగా తగిన మూల్యం చెల్లించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి యూనియన్ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. కార్యక్రమానికి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, రజిని, భవాని, విమల, పుష్ప, మీనా, రాజకుమారి, లత, స్వప్న, హైమావతి తదితరులు నాయకత్వం వహించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సైతం..




నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు పిజిఆర్‌ఎస్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతూ సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ఇంజినీరింగ్ కార్మికుల పిల్లలు తల్లికి వందనం డబ్బులు పడక చదువులకు దూరమవుతున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాకపోవడం వల్ల తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులూ లేకుండా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నెం.36 ప్రకారం వేతనాలు పెంచాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రిటైర్ అయిన వారికి గ్రాట్యూటీ చెల్లించాలని ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే అత్యవసర సేవలు నిలుపుదల చేసి సమ్మె చేపడతామన్నారు. కార్యక్రమానికి వినుకొండ రమేష్, కానూరు సత్యనారాయణ, సోమేశ్వరరావు, ఎస్.సింహాచలం, సూర్యనారాయణ, రాజు తదితరులు నాయకత్వం వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలని వైసిపి ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని తక్షణమే అమలు చేయాలని వైసిపి రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. యువత పోరు కార్యక్రమంలో భాగంగా సోమవారం వారు తొలుత స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని నెరవేర్చకుండా సంవత్సర కాలంగా యువతను మోసగిస్తుందని మండిపడ్డారు. తక్షణమే నిరుద్యోగ భృతి హామీని అమలు చేసి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, జిల్లాలోని వైసిపి నియోజకవర్గాల కన్వీనర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న వైసిపి నేతలు


పామాయిల్ ఫ్యాక్టరీ ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని పరిరక్షించాలని కోరుతూ ఎపి ఆయిల్‌ఫెడ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఎపి ఆయిల్‌ఫెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఎపి ఆయిల్ ఫెడ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పెదవేగి పామాయిల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు పామాయిల్ గెలలను తెచ్చే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏలేశ్వరం, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల పంటను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఆలోచన వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ ఫ్యాక్టరీని ప్రయివేటు పరం చేయొద్దని డిమాండ్ చేశారు. పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని మరింత అభివృద్ధి చేయాలి తప్ప అంచెలంచెలుగా సంస్థను ప్రయివేటీకరించే విధానాలు విడనాడాలని కోరారు. అవినీతి ఆరోపణలు ఉన్న జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పిజిఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టియు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు నాయకత్వం వహించగా, ముంగం అప్పారావు, ఎం.ప్రసాద్, హరి, నాగరాజు, మంగరాజు, రాము పాల్గొన్నారు.

మా ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించొద్దు

తహశీల్దార్ కార్యాలయం ముందు ఇందిరమ్మ ఇళ్ల కాలనీ లబ్ధిదారుల రిలే దీక్షలు



రిలే దీక్షల్లో కూర్చున్న లబ్ధిదారులు, నాయకులు కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి శివారు తరుగుమూల ఇందిరమ్మ ఇళ్ల కాలనీ స్థలాల్లోని కామన్ స్థలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణం చేయొద్దని, మా స్థలాలు మెరక చేయించి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేయాలని, మాకు అన్యాయం చేయవద్దు అంటూ తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. మా స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం ఆపాలని, మా స్థలాలు పూడిక చేసి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు సంఘీభావం తెలిపి మద్దతుని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పేరుతో 131 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఆ స్థలాలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో గత 20 సంవత్సరాలుగా పేదల స్థలాలను మెరక చేసి ఇళ్ల నిర్మాణం చేయకుండా ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. లబ్ధిదారుల అవసరార్థం బడి, గుడి, కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ ఏర్పాటు చేసుకునే విధంగా 40 సెంట్లు కామన్ స్థలం కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటినుండి నేటికి 20 సంవత్సరాలుగా పట్టాలన్న ఇవ్వండి మేరకైనా చేయండి అంటూ 131 మంది లబ్ధిదారులు పోరాటం చేస్తూనే ఉన్నారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా 20 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అదే స్థలాలలో లబ్ధిదారుల అవసరార్థం ఏర్పాటుచేసిన కామన్ సైట్‌లో పోలీస్ స్టేషన్ నిర్మించేందుకు పంచాయతీ గుట్టు చప్పుడు కాకుండా తీర్మానం చేసిందని, రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం దారుణమని విమర్శించారు. పేదల ఇండ్ల స్థలాలలో పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని నిలుపుదల చేసి, పేదల స్థలాలు మెరక చేసి ఇళ్లు నిర్మించుకునేలా చేయాలని, గృహ నిర్మాణ శాఖ వద్ద ఉన్న పేదల పట్టాలు పేదలకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం జరుగుతుందని, పేదలకు సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుద్దల రాముడు, బుద్దల రామారావు, ఏడుకొండలు, చంద్రశేఖర్, ముద్దుల చిన్న వెంకటేశ్వరరావు, రాయన పత్రాజు, గిరిజాల పద్మ, గోగులమూడి సుజాత, కసిరెడ్డి లక్ష్మీప్రసన్న, ఎడ్ల రాజ్యలక్ష్మి, ఎడ్ల సూర్యం, అవనిగడ్డ వెంకటేశ్వరమ్మ, నాయుడు నాగలక్ష్మి, కోట జయమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిఎస్‌సి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి 2025 పరీక్షలు సోమవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 183 మందికి 176 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 210 మందికి 200 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. మొత్తం 2 కేంద్రాలలో 393 మందికి 376 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 181 మందికి 149 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 134 మందికి 103 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం 198 మందికి 174 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాలలో 513 మందికి 426 మంది హాజరు కాగా 87 మంది గైర్హాజరయ్యారు.

కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నగరంలో ఆర్‌టిసి కార్గో సేవల విస్తృతానికి చర్యలు

అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పిఎల్‌విపి.సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగర పరిధిలో ఆర్‌టిసి కార్గో సేవలను విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పిఎల్‌విపి.సుబ్బారావు తెలిపారు. ఏపిటి ఏజెంట్‌గా పని చేసేందుకు పలు ప్రాంతాలలో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తంగెళ్లమూడి, శనివారపుపేట, ఆదివారపుపేట, నరసింహారావుపేట, అశోక్ నగర్, వట్లూరు, సత్రంపాడు, సిఆర్‌ఆర్ రెడ్డి కాలేజ్, మినీ బైపాస్, ఫైర్ స్టేషన్, జిల్లా పరిషత్ కార్యాలయం, ఆర్‌ఆర్ పేట, తూర్పు వీధి, పాతబస్టాండ్ సమీపంలో, పెదపాడు, దాటపర్రు, మాదేపల్లి ప్రాంతాల్లో కొంతర్గ ఏర్పాటుకు ఏజెంట్లను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వారు ఏలూరు డిపో డిఎంను, లేదా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(కమర్షియల్), సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

ఏలూరు : ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో రూ.4.68 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రెగ్యులర్ అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందించి వారి విద్యకు దోహదపడుతుందన్నారు. దృష్టి లోపం, బధిరులు, చలన వైకల్యాలు గల విద్యార్థులకు వీటిని అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలంపాట

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన 15 వాహనాల బహిరంగ వేలం ఈనెల 25వ తేదీన నిర్వహించబడునని ఎక్సైజ్ పోలీసులు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ వేలంలో పాల్గొనే వారు ముందుగా ధరావతు చెల్లించి పాల్గొనాలని చెప్పారు. పాటలో వాహనంను దక్కించుకున్న వారు సొమ్మును వెంటనే చెల్లించాలని, పాడిన ధరకు అదనముగా జిఎస్‌టి టాక్స్‌ను కూడా చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు తెలుసుకొనుటకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9618521855, సబ్ ఇన్‌స్పెక్టర్ 9963463363 నెంబర్లను సంప్రదించగలరని తెలియజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేత

ఉంగుటూరు : కాగుపాడు హైస్కూల్‌లో 2025 మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కాగుపాడు గ్రామస్తుడు రిటైర్ ఉద్యోగి కొరపాటి ఆంజనేయులు జ్ఞాపకార్థం కుమార్తె మణికుమారి ప్రోత్సాహ నగదు బహుమతులను సోమవారం అందజేశారు. మాజీ సర్పంచి, టిడిపి నాయకులు కడియాల రవిశంకర్ చేతులమీదుగా పాఠశాల ప్రథమ స్థానం పొందిన ధనకొండ ప్రేమ్ కుమార్ రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన ఉసదుమర్తి ప్రసన్న కృష్ణకి రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన వెలగపల్లి అనన్య గ్రేస్‌కి రూ.2 వేలు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి బాలకృష్ణ, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం.కళ్యాణ్ కుమార్, శీతాల నర్సు నారాయణ, కొరపాటి వెంకటరావు, రాజేష్, ఆశీర్వాదం, ముత్యాలరాజు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల జెఎసి ఏర్పాటు

ఏలూరు సిటీ : సచివాలయ ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఏలూరులో జెఎసి కమిటీ ఏర్పాటు చేసినట్లు సచివాలయ ఉద్యోగులు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. సచివాలయ ఉద్యోగుల జెఎసికి ఛైర్మన్‌గా జమియా శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా దుర్గాప్రసాద్, వైస్ ఛైర్మన్‌లుగా సునీత ప్రసన్న, శ్రీనివాస్ అబ్రహాంలు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ జెఏసి 54 నెంబర్ జిఒను సవరించాలని, అంతేకాకుండా వారి ప్రమోషన్స్, జాబ్ చార్ట్ కోసం, సీనియారిటీ జాబితా ప్రకటన, క్యాడర్ వారీగా ఉన్న సచివాలయ ఉద్యోగుల అందరికి వారి డిపార్ట్మెంట్ అర్హత మేరకు ప్రమోషన్లు ఇవ్వాలని, రేషనలైజేషన్‌లో మిగులు ఉద్యోగులు వంటి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాఠశాలల్లో వందశాతం హాజరు ఉండాలి : ఎంఇఒ

దెందులూరు : పాఠశాలల్లో వందశాతం హాజరు ఉండేలా చూడాలని మండల విద్యాశాఖ అధికారి ఆకెళ్ల వెంకట నాగ వర ప్రసాద్ కోరారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, హాజరు 100 శాతం ఉండాలన్నారు. 1వ తరగతి విద్యార్థుల ఎన్రోల్మెంట్(నమోదు) పెంపుదల, సిలబస్ సకాలంలో పూర్తి చేయడం, 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు సంసిద్ధత కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు అందరికీ తెలుగు, ఆంగ్ల, గణిత సబ్జెక్టులలో కనీస సామర్థ్యాలు కలిగి ఉండేలా కృషి చేయాలని ఆదేశించారు.

అడ్డంగా ఉన్న సామాగ్రిని తరలించాలని ఫిర్యాదు

ముసునూరు: పాఠశాలలో చదివే విద్యార్థులకు అడ్డుదిడ్డంగా వున్న భవననిర్మాణ సామాగ్రిని తీసివేయాలని గ్రామస్తులు కోరారు. సోమవారం మండలంలోని గుళ్ళపూడి శివారు గుడిపాడు గ్రామ పరిధిలో వున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలు భవననిర్మాణానికి ఉపయోగించే సామాగ్రి అడ్డదిడ్డంగా వుండటం వల్ల 1వ తరగతి నుండి 5 వతరగతి వరకు చదివే విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వుందని గ్రామస్తులు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంఇఓ బివిఎస్ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, పంచాయతీ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పర్యవేక్షించి సంబంధిత కాంట్రాక్టు దారులతో మాట్లాడి మరుసటి రోజుల్లో ఆ భవననిర్మాణ సామాగ్రిని అక్కడ నుంచి వేరొకచోటకి తరలించాలని ఆదేశించారు. టిడిపి నాయకులు కొల్లి గంగారావు, మండలంలో ధర్మరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

ఉంగుటూరు : గుళ్లపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లవ్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ విద్యాసామాగ్రిని సోమవారం పంపిణీ చేశారు. పుస్తకాలు, పెన్సిళ్లు, పౌచ్ తదితర సామాగ్రిలను అందించినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్, హెచ్‌ఎం, యోహాను, బాలకృష్ణ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఎన్‌ఆర్‌ఆర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, బూట్లు, బెల్టు మొదలగునవి విద్యార్థులకు కౌన్సిలర్ కందుల సత్యనారాయణ అందచేశారు. హెచ్‌ఎం డివిఎల్.పుష్పలత, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎ.లక్ష్మీ పాల్గొన్నారు.

23 మంది యువకుల రక్తదానం

ఏలూరు అర్బన్ : స్థానిక వట్లూరులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 23 మంది యువకులు రక్తదానం చేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. డైరెక్టర్ ఎస్.ఎస్.శశి కిషోర్, రెడ్ క్రాస్ పిఆర్‌ఓ కె.వి.రమణ పాల్గొన్నారు.

ఉరేసుకుని గర్భిణి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : గర్భవతిగా ఉన్న వివాహిత ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఏలూరు నగరంలో సోమవారం చోటుచేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరపరిధిలోని మూడో పట్టణ పరిధిలోని శ్రీరామ్ నగర్ 9వ రోడ్డుకు చెందిన కాశీరావు కేదేశ్వరరావుకు, దేవి(30)కి వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఉన్న అపార్ట్మెంట్లో దేవి వాచ్ మెన్‌గా పనిచేస్తూ ఉండగా భర్త బయట కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. అయితే కొద్ది కాలం క్రితం దేవి గర్భవతి అని తెలిసింది. దీంతో మనకి మరో సంతానం వద్దు అన్న అంశంతో భార్యాభర్తలకు ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. సోమవారం మధ్యాహ్నం భర్త ఇంటి బయట ఉన్న కుమారుడిని ఆడిస్తూ ఉండగా దేవి ఇంట్లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకుని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎంతకు బయటికి రాకపోవడంతో భర్త తలుపులను కొట్టి చూడగా తెరవలేదు. ఆమెను ఆమె భర్త కిటికీ నుంచి గమనించి వెంటనే కిటికీలో నుంచి లోనికి వెళ్లి చూసేసరికి ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. భర్తను పూర్తిగా విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా ఏరియా ఆసుపత్రి భవనాలు

డాక్టర్స్ తక్కువ.. భవనాలు ఎక్కువ

అన్ని విభాగాలు ఏర్పాటు చేసి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని ఏరియా ఆసుపత్రి భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలో వున్న మొగాళ్లపు నరసయ్య ఏరియా ఆసుపత్రి అంటే తెలియని వారు ఎవరూ వుండరు. ఈ చుట్టుపక్కల అన్ని మండలాలకి ఇదే అతి పెద్ద ప్రభుత్వాసుపత్రి. ఇక్కడ సరిపడా భవనాలు వున్నాయి కానీ ఈ భవనాలను ఉపయోగించుకోవటం లేదు. ఈ భవనాలలో పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ అన్ని విభాగలు పెట్టి, ఆసుపత్రిని అభివృద్ధి చేస్తే ప్రయివేటు ఆసుపత్రుల కన్నా మెరుగైన వైద్యం పేద ప్రజలకు అందించవచ్చని మండల ప్రజలు కోరుతున్నారు. కానీ ఎవరూ పట్టించుకోవటం లేదు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలంటే ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలతో, అన్ని రకాల విభాగాలతో అభివృద్ధి చేయగలిగితే పేద ప్రజలకు మేలు చేసిన వారవుతారని ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఈ చుట్టుపక్కల మండలాల ప్రజలందరూ కోరుకుంటున్నారు. ఈ ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ విభాగాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇక్కడ అన్ని రోగాలకు మంచి వైద్యం అందించగలిగితే ప్రజలకి ఎంతో ఉపయోగమంటున్నారు. విజయవాడ, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలు ఎలా ఉన్నాయో అలా ఇక్కడ కూడా ఉంటే ప్రజలు ఎక్కువ దూరం వెళ్లకుండా పేద ప్రజలకు మంచి వైద్యం అందించవచ్చు అని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ డాక్టర్స్ వేరే ప్రయివేట్ ఆసుపత్రులు నడపకుండా, ప్రయివేట్ హాస్పిటల్లో పనిచేయకుండా, ప్రభుత్వ డాక్టర్స్ కేవలం ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే పనిచేయాలని, సమయానికి డాక్టర్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో పేద ప్రజలను దోపిడీకి గురికాకుండా చూడాలని, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సదుపాయం, వెంటిలేటర్ సదుపాయం లేదని, ఇవి కూడా ఈ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేయగలిగితే ప్రజలు ఎంతో సంతోషిస్తారని చెబుతున్నారు. ఎంఎల్‌ఎ, ఆసుపత్రి కమిటీ వారు ఈ ఆసుపత్రి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈ హాస్పిటల్‌ని అభివృద్ధి చేయాలని, అలాచేస్తే ఎంతోమంది పేద ప్రజలకు మేలు జరుగుతుందని చుట్టుపక్కల మండలాల ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



ఏరియా ఆసుపత్రి



నిరుపయోగంగా ఉన్న భవనం

కుట్టు శిక్షణా కేంద్రాన్ని తెరవాలి

మహిళల ఆందోళన

ఉంగుటూరు : ఉంగుటూరు ఆర్‌బికెలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని అర్థాంతరంగా మూసేశారని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉంగుటూరులో ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్‌కు 27 మంది ఫిర్యాదు చేశారు. బిసి కార్పోరేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ ఇచ్చి అర్హులైన వారికి ఉచితంగా మిషన్లు ఇస్తామని చెప్పి ట్రైనింగ్ కోసం మండలంలో అన్ని గ్రామాల నుంచి 144 మందిని ఎంపిక చేశారు. వారికి రోజుకు రెండు సెక్షన్లు వారీగా బిసి కార్పొరేషన్ అధికారులు ఎంపిక చేసిన ట్రైనింగ్ ఇచ్చారు. 15 రోజుల పాటు నేర్చుకున్నామని, శిక్షణా కాలం పూర్తికాకుండానే సెంటర్‌ను మూసేయడం పట్ల ఆందోళన చెందుతున్నామని ఎంపిడిఒకు వెల్లడించారు. దీనిపై ఎంపిడిఒ సంబంధిత సెంటర్ నిర్వాహకులు రమ్య, మోహన్‌కుమార్‌లను ఫోనులో సంప్రదించారు. సెంటర్ మూసివేత తన దృష్టికి రాలేదని ఒకరు, 140 మంది హాజరు ఉంటేనే సెంటరు నడుపుతామని మరొకరు, తనిఖీ చేస్తానని మరొకరు సమాధానం చెప్పారని ఎంపిడిఒ మహిళలకు వివరించారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు

మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్లు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏ ప్రభుత్వ కార్యక్రమాలలోను ప్రోటోకాల్ పాటించట్లేదని జంగారెడ్డిగూడెం పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 16వ తేదీన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ గాని, ఛైర్‌పర్సన్‌కి గాని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారి ఇష్టానుసారంగా నిర్వహించారన్నారు. అలాంటి చర్యలు భవిష్యత్తులో జరగకూడదని, దీనికి సంబంధించిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్లు ఆర్‌డిఒను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు వెళ్లే రోడ్డు

గోతులు పూడ్చాలి : సిఐటియు నాయకులు బి.సోమయ్య

ఏలూరు అర్బన్ : నిత్యం 2000 మందికిపైగా హాస్టల్ పిల్లలు నడిచే రోడ్డు మార్గానికి మోక్షం లేదా అని సిఐటియు నాయకులు బి.సోమయ్య ప్రశ్నించారు. సోమవారం స్థానిక అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉండటం చూసిన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిఎంసి బాలయోగి సైన్స్ పార్క్, ఎనిమిది హాస్టళ్లు, సోషల్ వెల్ఫేర్ జిల్లా కార్యాలయం, రెండు విద్యుత్ కార్యాలయాలకు వెళ్లే ఆ మార్గం వర్షం వస్తే బురద నీరు నిండిపోయి అధ్వానంగా తయారైందన్నారు. ఈ మార్గం గుండా ప్రతి రోజు 2 వేల మంది హాస్టల్ పిల్లలు ఉదయం, సాయంత్రం ఈ బురదలో నుండే నడుచుకుంటూ వెళ్లాలని తెలిపారు. ప్రభుత్వం వారం రోజుల్లో స్పందించి గోతులు పూడ్చి, రోడ్డు బాగా చేయకపోతే సిఐటియు సంఘంగా తామే శ్రమదానం చేసి, గోతులు పూడ్చి రోడ్డు బాగు చేస్తామని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పద్మజారాణి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.పద్మజారాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ గుంటూరు జిల్లా తెనాలి ఆసుపత్రికి సాధారణ బదిలీ అయ్యారు. అనస్తీష్య డాక్టర్‌గా ఉన్న డాక్టర్ పద్మజారాణి సూపరింటెండెంట్ గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉంటామని డాక్టర్ పద్మజ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి 'జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్'

జీలుగుమిల్లి : గిరిజనుల అభివృద్ధికి జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్ తెలిపారు. మండలంలోని మధ్య బర్రింకలపాడు గ్రామంలో జరిగిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీలోని పలువురు గిరిజనుల నుంచి పలు పథకాలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, వాటిని స్థానిక గిరిజనులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురికి ఆరోగ్య కార్డులు, సికెల్ స్క్రీనింగ్, టిబి కిట్లు, పోషకాహార కిట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వనమా రాంబాబు, వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్, పంచాయితీ రాజ్ ఎఇ రామానుజం, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ దేవమ్మ, పంచాయితీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలకు అసమాన గౌరవం

ఆమెన్ ట్రస్ట్‌కు ఐక్యరాజ్యసమితి సత్కారం

కొయ్యలగూడెం : స్వచ్ఛంద సేవలో అసమాన గౌరవం సాధించిన ఆమెన్ ట్రస్ట్‌కు ఐక్యరాజ్యసమితి ప్రజాసేవా దినోత్సవం సందర్భంగా అరుదైన సత్కారం దక్కింది. మండలంలోని అంకాలగూడెంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 36 మంది పేదలకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేసిన ఆమెన్ ట్రస్ట్‌ను స్థానికులు ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, స్వచ్ఛంద సేవకులు జివివి.ప్రసాద్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్‌ను ప్రశంసిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు, శస్త్రచికిత్సలు, కళ్లజోళ్ల పంపిణీ, మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ, దోమతెరల పంపిణీ, విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేత వంటి బహుముఖ సేవలను ఆయన వివరించారు. ఉన్నత విద్యావంతులై ఉద్యోగాలను త్యాగం చేసి, ప్రజాసేవకు అంకితమైన ఇవాంజలిన్ అశోక్ నిజమైన సేవకు నిదర్శనమని అన్నారు. ఈ చారిత్రాత్మక సత్కారంపై ఇవాంజలిన్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు కూనపం రాజారత్నం, చాంద్ర చక్రవర్తి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ నియంత్రించాలి : డివైఎఫ్ఐ

జంగారెడ్డిగూడెం : ప్రయివేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లు నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అమ్మరాదని కోరుతూ 'పిజిఆర్‌ఎస్'లో ఆర్‌డిఒ ఎంవి.రమణకు డివైఎఫ్ఐ ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.మాబు సుభాని మాట్లాడుతూ స్థానిక జంగారెడ్డిగూడెం పట్టణంలో విద్యావికాస్ విద్యాసంస్థలలో తన కుమార్తె ఐదవ తరగతి చదువుతుందని, ఈ విద్యా సంవత్సరం పాఠ్యపుస్తకాలకు గాను రూ.7 వేలు వసూలు చేశారన్నారు. అందులో కొన్ని టెక్స్ట్ బుక్స్, కొన్ని నోట్ పుస్తకాలు ఇచ్చారు కానీ.. నోట్స్ పుస్తకాలపైన ఏ విధమైన ధర ముద్రించలేదన్నారు. ఒక్క టెక్స్ట్ పుస్తకాలుపైన మాత్రమే ఎంఆర్‌పి ధరలు ఉన్నాయని, కానీ మొత్తంగా పుస్తకాలకు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎంఇఒ వెంటనే స్పందించి విద్యాసంస్థలలో జరుగుతున్న వ్యాపార దందాను అరికట్టాలని, లేనియెడల ప్రయివేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ప్రజాసంఘాల వారిని ఐక్యం చేసుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతోంది

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

కొయ్యలగూడెం : మండలంలో కన్నాపురంలోని ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్‌లో సిపిఎం జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు రెండవ రోజు జరిగాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాద, నిరంకుశ విధానాలతో మత విద్వేషాలను రెచ్చగొడుతోందని, కోటి ఉద్యోగాల వాగ్దానం నీరుగారిపోయిందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా యోగా పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. దేశ సంపదను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన కార్పొరేట్ స్నేహితులకు చవకగా కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో కార్యకర్తలు చైతన్యవంతంగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎస్‌విఆర్ కళ్యాణ మండపం నుంచి కన్నాపురం ప్రధాన కూడలి వరకు సిపిఎం కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దివాలా కోరు విధానాలతో ప్రజలపై భారాలు మోపుతోందని, ఆరు హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, మానుకొండ జీవరత్నం, గూడెల్లి వెంకట్రావు, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

సాగు భూములను సేకరించొద్దు

గిరిజనుల వేడుకోలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏళ్ల తరబడి గిరిజనులు సాగులో ఉన్న భూములను సైతం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుందని, ఆదివాసీలకు, గిరిజనేతరులకు మధ్య వివాదాలు ఉన్నటువంటి భూములను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం కొనుగోలు చేయవద్దని, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టొద్దని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు తెలిపారు. ఈమేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సోమవారం ఫిర్యాదు చేశారు. భూ సేకరణ చేసేటప్పుడు గ్రామసభలు నిర్వహించకుండా, పేసా చట్టాలను అమలు చేయకుండా సేకరించడం తగదన్నారు. మండలంలోని రెడ్డి గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 186/2ఎలో 9 ఎకరాల 75 సెంట్లు, సర్వేనెంబర్ 153, 154,155లలో 20 కుటుంబాలకుపైగా భూములు గిరిజనులు సాగు చేసుకుంటున్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూనవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ భూములను కొనుగోలు చేసే పేరుతో దళారులు భూముల్లోకి అధికారులు తీసుకువచ్చి రికార్డులను తారుమారు చేస్తూ, అక్రమ పద్ధతిలో భూ వివాదాలు ఉన్నటువంటి భూములు అమ్మకానికి పెట్టేందుకు సంసిద్ధం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఏళ్ల తరబడి గిరిజనులు సాగులో ఉన్న వారి పేర్లు రెవెన్యూ రికార్డులలో నమోదు చేయడం గాని, రెవెన్యూ అధికారులు గిరిజనులను సాగుదారులుగా గుర్తించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి 2020 వరకు జరిగిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం చేసిన భూసేకరణలో ఎక్కువ శాతం భూములు గిరిజనులు సాగులో ఉన్నవేనని, ఎల్‌టిఆర్ భూములేనని ఈరోజు స్థానిక గిరిజనులకు, నిర్వాసితులకు మధ్య విభేదాలు రావడానికి, విద్వేషాలు చెలరేగడానికి అధికారులు ఆరోజు ఉన్నటువంటి ప్రభుత్వం చేసినటువంటి పాపమేనని ఆయన తెలిపారు. రెవెన్యూ అధికారులు గిరిజనేతరుల పేరుతో ఇష్టారాజ్యంగా రికార్డులు తారుమారు చేస్తున్నారని గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆయన తెలిపారు. గిరిజనులను సాగుదారులుగా గుర్తించకపోవడం ఆదివాసుల పట్ల ప్రభుత్వం రెవెన్యూ అధికారులు చూపిస్తున్న వివక్షకు నిదర్శనమని ఆయన తెలిపారు. స్థానిక ఎస్‌డిసి కోర్టులోను గిరిజనులు దాఖలు చేసిన ఫిర్యాదులను, కోర్టు కేసులు అనేకం ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, గిరిజనుల భూ సమస్యలను పరిష్కారం చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఐటిడిఎ పిఒ రాములు నాయక్‌కి భూ సేకరణ జరుగుతున్న ప్రాంతాలలో వివాదాస్పద భూములను సేకరించవద్దని గిరిజన సంఘాల ద్వారా, సిపిఎం ద్వారా తెలియచేసామన్నారు. దానికి స్పందించినటువంటి ఐటిడిఎ పిఒ వివాదాస్పద భూములను ఎట్టి పరిస్థితులను స్వీకరించమని గతంలో తెలియపరిచారు కానీ బుట్టాయిగూడెం రెవెన్యూ సిబ్బంది వివాదాస్పద భూములను సేకరించుటలో నిమగ్నమై ఉన్నారన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గిరిజనులు సాగులో ఉన్నటువంటి భూములను, గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య వివాదాలు ఉన్నటువంటి భూములను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేయొద్దని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి గణపవరం గ్రామ గిరిజనులైన కొరసా సురేష్, ఉయికె శ్రీరాములు, కట్టం నాగేంద్ర, గుండి గంగాధర్ రావు, ముయ్యబోయిన బాబురావు, కారం ఏసు, దారి రాజ్‌కుమార్, డి.వెంకటేశ్వరరావు, మడకం బోడయ్య, గజ్జి ముత్యాలు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

మయిబోయిన బాబురావు, రెడ్డి గణపవరం గిరిజనుడు



ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల్లో వివాదాలు ఉన్న భూములు కొనుగోలు చేసి స్థానిక గిరిజనులమైన మాకు, నిర్వాసితులకు మధ్య తగాదాలు పెట్టే పని అధికారులు చేస్తున్నారు. గిరిజనేతరులైన వారు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భూములు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివాసుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి మమ్మల్ని బలి పశువులు చేస్తున్నారు. మా భూములు మాకు ఇప్పించి మాకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

మా భూములకు రక్షణ కల్పించండి

కోర్సా సురేష్, రెడ్డి గణపవరం



కూటమి ప్రభుత్వం మా భూములకు రక్షణ కల్పించాలని కోరుకుంటున్నాం. అన్ని హక్కులు, చట్టాలు మాకు అనుకూలంగా ఉన్నా వాటి అమల్లో మాత్రం తీవ్రమైన నిర్లక్ష్యం జరుగుతోంది. పేరుకు మాత్రమే ఆదివాసి చట్టాలు ఉన్నాయి. అమల్లోకి వచ్చేసరికి అవి అందని ద్రాక్షగా మిగిలిపోతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం మమ్మల్ని సాగుదారులుగా గుర్తించి మాకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నాం.

రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం లేదు

ఉయికె శ్రీరాములు, రెడ్డి గణపవరం



గత 30 ఏళ్లుగా మేము సాగుచేస్తున్న భూములు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయమని పలుమార్లు దరఖాస్తులు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. గిరిజనేతరుల పేర్లను ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. సాగులో మేమున్న ఏ రోజు మమ్మల్ని సాగుదారులుగా గుర్తించడం లేదు. ప్రభుత్వం గిరిజనుల పట్ల ఎందుకు వివక్షపూరితంగా వ్యవహరిస్తుందో తెలియడం లేదు.

స్వచ్ఛ సేవా సంస్థకు ధన్యవాదాలు

ఎంఆర్‌సి కాలనీ వాసులు

టి.నర్సాపురం : గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేసిన స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత పెండ్యాల అభిషేక్ బాబుకు మండలంలోని బొర్రంపాలెం ఎంఆర్‌సి కాలనీ వాసులు సోమవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్‌సి కాలనీలో సుమారు 15 కుటుంబాలు వారు ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, గడిచిన మూడు సంవత్సరాలుగా అక్కడే పిల్లాపాపలతో జీవిస్తున్నామనీ, తమకు కనీస అవసరాలైన తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని నాయకులు, అధికారులు దృష్టికి ఎన్నో మార్లు తిరిగినా తమను ఏ ఒక్కరు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామానికి చెందిన మాజీ సరంచి పెండ్యాల మల్లిబాబు తనయుడు స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, పారిశ్రామిక వేత్త పెండ్యాల అభిషేక బాబును కలిసి కాలనీలో తాము పడుతున్న ఇబ్బందులు చెప్పడంతో ఆయన సానుకూలంగా స్పందించడమే కాకుండా ఆయన ఆర్థిక సహాయంతో యుద్ధ ప్రాతిపదికన మంచినీటి పైపులు వేయించి, తమ సమస్యను పరిష్కరించారని తెలిపారు. కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి స్పందించి తమ వెంట ఉన్న బత్తుల రమేష్, కొనకళ్ల సర్వేశ్వరరావు, పల్లా రమేష్, కంభంపాటి జోగేశ్వరావు, రాజబోయిన రమేష్, గుండె పాండురంగ, గుండె చిట్టియ్యలకు వారు అభినందనలు తెలిపారు.

సమస్య పరిష్కరిస్తామని హామీ

నూజివీడు టౌన్ : సాధారణంగా సమస్యలను ప్రజలు అధికారుల వద్దకు తీసుకువెళ్లి వివరించడంతో... ఆ సమస్య పరిష్కారం పట్ల అధికారులు హామీ ఇవ్వడం జరుగుతుంది. అందుకు పూర్తి విరుద్ధంగా భిన్నమైన కోణంలో సమస్య ఉన్న అర్జీదారుల వద్దకే సాక్షాత్తు సబ్ కలెక్టర్ కదలి వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్న వైనం సోమవారం చోటుచేసుకుంది. నూజివీడు పట్టణం మొగళ్ల చెరువుకు చెందిన షేక్ ఆశ(35), లటికే శివ(43) ఏడాదిన్నర క్రితం ప్రమాదంలో కాళ్లు కోల్పోగా ఇప్పటివరకు పింఛన్ అందించలేదని వాపోయారు. నూజివీడు సబ్ కలెక్టర్‌కు సోమవారం మీకోసంలో అర్జీ దాఖలు చేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్య తెలుసుకొని పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

మీకోసంలో 21 అర్జీలు సమర్పించిన ప్రజలు: నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు అర్జీల రూపంలో అందించారు. వివిధ సమస్యలకు సంబంధించి 21 అర్జీలు సమర్పించారు.

'పిజిఆర్‌ఎస్'కు 50 ఫిర్యాదులు

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లా వ్యాప్తంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 50 ఫిర్యాదులందాయని, వెంటనే ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు సంయుక్తంగా పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

డ్రోన్ బహూకరణ

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి కెకెఆర్ గౌతమ్ సంస్థల యాజమాన్యం సోమవారం ఒక డ్రోన్‌ను బహూకరించింది. గత కొంతకాలంగా ఏలూరు జిల్లా పోలీస్ డ్రోన్ల సహాయంతో అత్యంత ఆధునికంగా పోలీసింగ్ చేయడం జిల్లా ప్రజలకు విధితమే. పోలీసు శాఖ ఈ డ్రోన్ ద్వారా మరింత సహాయ సహకారాలు అందిస్తుందని ఆకాంక్షించారు. కెకెఆర్ గౌతమ్ సంస్థల యాజమాన్యానికి జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పితో పాటు నూజివీడు డిఎస్‌పి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు ఏర్పాటుపై హర్షం

ముసునూరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఎపిఎస్‌ఆర్‌టిసి ఏలూరు డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించినందుకు గ్రామస్తులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు గ్రామ పరిధిలో వున్న జిల్లా పరిషత్ వున్నత పాఠశాలలో చదువుతున్న గుడిపాడు, వలసపల్లి, చెక్కపల్లి దివాణం, ఆర్‌సి పురం గ్రామాల నుంచి విద్యార్థులు 3 నుంచి 4 కిలో మీటర్లు సైకిళ్లపై లేదా నడుచుకుంటూ వెళుతున్నారు. వర్షం వచ్చిన రోజుల్లో స్కూల్‌కు వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని, గతంలో ఏలూరు ఆర్‌టిసి డిపో వారికి వినతిని అందజేశారు. నేటికి బస్సు సౌకర్యం కల్పించారు. హెచ్‌ఎం కె.నాగబాబు పాల్గొన్నారు.